క్లుప్తంగా

లక్ష్మీనృసింహ స్వామిని దర్శించిన జేసీ



స్వామివారి ఆశీర్వాదం తీసుకుంటున్న జాయింట్ కలెక్టర్ శోభిక, కుటుంబసభ్యులు

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణ ముఖి నదీ తీరాన వేంచేసిన వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువైన లక్ష్మీనృసింహ స్వామిని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ శోభిక కుటుంబసభ్యులతో కలిసి గురువారం దర్శించారు. ఈ సందర్భంగా జేసీ కుటుంబసభ్యులతో ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు పూజలు చేయించారు. అలాగే స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి వచ్చి ముడుపుల పూజల్లో పాల్గొన్నారు. ఆలయానికి ఉపవాసాలతో వచ్చి పూజల్లో పాల్గొన్న భక్తులందరికీ ఆలయ నిర్వాహకులు, అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఏటా దూడ కలిగితే ఆర్థిక భరోసా



మాట్లాడుతున్న డాక్టర్ సీహెచ్ దీనకుమార్

సీతానగరం: మండలంలోని పాడి పశువులు ఏడాదికో దూడను ఈనితేనే రైతుకు పాడితో పాటు, ఆర్థిక భరోసా కలుగుతుందని సీతానగరం పశుసంవర్ధక శాఖ ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్ అన్నారు. సీతానగరం సబ్‌డివిజన్ కార్యాలయంలో చూడి తనిఖీలు చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ సబ్‌డివిజన్ పరిధిలో బలిజిపేట, సీతానగరం మండలాల్లో గొర్రెలు, మేకల మందలు ఉన్న ప్రాంతాలను గర్తించి వ్యాధి నిరోధక మందులు సిబ్బంది సహకారంతో వేస్తున్నట్లు చెప్పారు. శీతాకాలంలో వచ్చే వ్యాధుల నివారణకు తీసుకున్న ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వ్యాక్సిన్ నిర్దేశించిన గడువుకు ముందుగానే వేశామని తెలిపారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో అన్నదానం



పేదలకు అందజేసేందుకు తీసుకువచ్చిన ఆహార పదార్థాలు

పార్వతీపురం రూరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం మండలంలోని చినమరికి గ్రామంలో రెడ్‌క్రాస్ సంస్థ సభ్యుడు బోటు రామకృష్ణ పేదలకు అన్నదానం చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుల వివాహాది శుభకార్యాల వద్ద మిగిలిన ఆహారపదార్థాలను సేకరించి పేదలు, నిరాశ్రయులకు సభ్యుడు రామకృష్ణ కొంతకాలంగా అందజేస్తున్నారు. ఆయన చేస్తున్న ఈ సేవలపట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కోళ్లఫారం పరిశీలన



పాపయ్యవలస గ్రామం సమీపంలో కోళ్లఫారాన్ని పరిశీలిస్తున్న పశువైద్యాధికారి పోలందొర

మక్కువ: మండలంలోని పాపయ్యవలస గ్రామం సమీపంలోని కోళ్లఫారాన్ని పశువైద్యాధికారి కె.పోలందొర గురువారం పరిశీలించారు. కోళ్లకు వ్యాధులు ప్రబలి, మృతిచెందుతున్నందున అప్రమత్తంగా ఉండాలని, నిర్వాహకులకు అవగాహన కల్పించారు. వ్యాధులు ప్రబలితే సమాచారం అందించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి స్వల్పగాయాలు

సాలూరు రూరల్: మండలంలోని కోదుకరకవలస దత్తివలస గ్రామాల మధ్యలో ఆటో అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన సంఘటనలో ఐదుగురికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మామిడిపల్లి నుంచి సాలూరు వస్తున్న ఆటో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో ఆటో డ్రైవర్ సహా చోడిపల్లి రవీంద్ర, గెమ్మెల గౌరి, సిహెచ్. రాజారావు, శంబరమ్మలకు స్వల్పగాయాలయ్యాయి. గాయాలైన వారంతా మరో ఆటోలో ఏరియా ఆస్పత్రికి వెళ్లి ప్రథమ చికిత్స చేయించుకున్నారు.

బాల్య వివాహ వ్యవస్థను నిర్మూలిద్దాం

- ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ
- జిల్లా బాలల సంరక్షణపై వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐసీడీఎస్ పీడీ టి.కనకదుర్గ, ఎస్పీ ఎస్.వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురంటౌన్:

బాల్య వివాహ వ్యవస్థను నిర్మూలిద్దామని ఐసీడీఎస్ పీడీ టి కనకదుర్గ అన్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ ఆఫీసులో గల కాన్ఫరెన్స్ హాల్ నుంచి సబ్‌ఇన్‌స్పెక్టర్లు, మహిళా పోలీస్, స్టేషన్ హౌస్ ఆఫీసర్, సీడీపీఓలతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమావేశం నిరవహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో బాల్యవివాహాల నివారణకు జీఓ నంబర్ 31-39 ప్రకారం జిల్లాలో ఉన్న అధికారులు స్టేషన్ హౌస్‌ఆఫీసర్, మహిళా సంరక్షణ కార్యదర్శులను చైల్డ్ మ్యారేజ్ ప్రొబేషన్ ఆఫీసర్లుగా ప్రభుత్వం నియమించిందన్నారు. బాల్యవివాహాల నివారణ అధికారులు(సీఎంపీఓ)గా మహిళా పోలీసులు, స్టేషన్ హౌస్ ఆఫీసర్, గ్రామ సెక్రటరీ వీఆర్‌ఓ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సీడీపీఓలు విధులు నిర్వహించాలని కోరారు. గ్రామస్థాయిలో బాల్య వివాహాల నివారణ అండ్ మానిటరింగ్ కమిటీలను గ్రామస్థాయిలో నియమించామన్నారు. వాటిని బలోపేతం చేసి ఫంక్షనింగ్ అయ్యేలా గ్రామస్థాయి సిబ్బంది కృషి చేయాలని సూచించారు.

అవగాహన కల్పించాలి

కిశోరీ వికాసం ప్రోగ్రాంలో భాగంగా జిల్లాలో కౌమర దశలో ఉన్న బాలబాలికలను గుర్తించి వారిని గ్రూపులుగా ఏర్పాటు చేసి వారి ఆరోగ్యం, విద్య, న్యూట్రిషన్ గ్రోత్, రక్తహీనత, లైఫ్‌స్కిల్స్, సెల్ఫ్‌డిఫెన్స్, లైంగిక దాడులు, ఋతు చక్రం పరిశుభ్రత తదితర విషయాలపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. పిల్లలపై జరిగే లైంగిక దాడులను అరికట్టాలని గ్రామస్థాయిలో ఉన్న హైస్కూల్స్, జూనియర్ కాలేజీల్లో ఉన్న ఆడ, మగ పిల్లలకు అవగాహన కల్పించాలని తెలియజేశారు. జిల్లాలో అనధికార దత్తత జరగకుండా చూడాలని, ఆడపిల్లలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టాలని, జిల్లాలో ఎక్కడ కూడా ఎలాంటి లైంగిక దాడులు జరగకుండా పిల్లలందరికీ పిల్లల చట్టాలపై అవగాహన కల్పించాలని మహిళా కార్యదర్శులకు తెలియజేశారు. అనంతరం ఎస్పీ ఎస్.వీ మాధవ్ రెడ్డి ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐలు, ఎస్సైలు, జిల్లా బాలల సంరక్షణ విభాగం, లీగల్ కమ్ ప్రొహిషన్ ఆఫీసర్ పి.శ్రీధర్ పాల్గొన్నారు.

చింతపండు జీసీసీలో విక్రయిస్తే గిట్టుబాటు



గిరిజనులతో మాట్లాడుతున్న జీసీసీ మేనేజర్ రామారావు

మక్కువ: గిరిజనులు సేకరించిన చింతపండును జీసీసీ గోదాములో విక్రయిస్తే, మంచి గిట్టుబాటు ధర అందుతుందని సాలూరు జీసీసీ మేనేజర్ జి.రామారావు తెలిపారు. ఈ మేరకు మక్కువ మండలంలోని దుగ్గేరు గ్రామంలో గల జీసీసీ గోదామును గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనులు సేకరించిన చింతపండుకు మంచి గిట్టుబాటు ధర పలుకుతుందన్నారు. జీసీసీలో కిలోచింతపండు ఇంతవరకు రూ.34 ఉండగా, గురువారం నుంచి కిలో చింతపండు రూ.36లకు కొనుగోలు చేస్తున్నట్లు గిరిజనులకు అవగాహన కల్పించారు. నేరుగా గిరిజనులు జీసీసీ గోదాములకు చింతపండు తీసుకువచ్చి విక్రయించాలని సూచించారు. దళారుల బారిన పడి మోసపోవద్దని హితవు పలికారు. సాలూరు జీసీసీ సొసైటీ పరిధిలోని ఐదు మండలాల్లో ఏర్పాటుచేసిన 10పీపీ కేంద్రాల ద్వారా, 36 డీఆర్‌డిపోల ద్వారా చింతపండు, ఇతరత్రా అటవీఉత్పత్తులు విక్రయించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో సేల్స్‌మన్ రమణ తదితరులు పాల్గొన్నారు.

స్టెమీతో గుండె పోటుకు భరోసా



స్టెమీ ఇంజక్షన్‌పై అవగాహన కల్పిస్తున్న జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.వాగ్దేవి

పార్వతీపురంటౌన్: స్టెమీ ఇంజక్షన్‌తో గుండె పోటుకు భరోసా ఉంటుందని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.వాగ్దేవి అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుండెపోటుకు ఎమర్జెన్సీగా ఇచ్చే ఇంజక్షన్‌ను టెనెక్టివ్ ప్లస్ ఇంజక్షన్ అంటారన్నారు. దీనిని ఉచితంగా అందజేసేందుకు జిల్లా ఆస్పత్రిలో అందుబాటులోనికి తీసుకువచ్చామని తెలిపారు. ఇదివరకు గుండెపోటు వ్యాధిగ్రస్తులు హుటాహుటిన విశాఖపట్నం లేదా శ్రీకాకుళం వెళ్లవలసి వచ్చేదని, గుండెపోటు వచ్చిన వారికి ఎంత త్వరగా గుండెపోటు ఇంజక్షన్ ఇస్తే అంత మంచిదని, ఆలస్యం ఆయితే ప్రాణాలు పోయే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. గుండెపోటుకు ఇచ్చే టెనెక్టివ్ ప్లస్ ఇంజక్షన్ సుమారు రూ.45,000 ఖరీదు. కానీ జిల్లా ఆస్పత్రిలో ఉచితంగా లభిస్తుందన్నారు. ఇప్పటివరకు జిల్లా ఆస్పత్రిలో 10 మందికి ఇంజక్షన్‌లు అందజేసినట్లు తెలిపారు. ఛాతీ నొప్పి, ఆయాసం మొదలగు గుండెపోటు లక్షణాలు గల రోగులు నేరుగా గాని 108లో గాని త్వరగా జిల్లా ఆస్పత్రికి చేరుకోవాలని సూచించారు. ఈసీజీ తీసి ఆన్‌లైన్‌లో కార్డియాలజిస్టును సంప్రదించి గుండెపోటును నిర్ధారించిన వెంటనే టెనెక్టివ్ ప్లేస్ ఇంజక్షన్ ఇచ్చి ప్రాణాలు కాపాడే చర్యలను తీసుకుంటున్నట్లు తెలిపారు.

పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో స్వరూపరాణి

మక్కువ: మండలంలోని అన్ని పంచాయతీల్లో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో డీడీ స్వరూపరాణి అన్నారు. ఈ మేరకు స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో గురువారం ఆమె మండలస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్నది వేసవికాలం కానుందున గ్రామాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. సుర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. గృహ నిర్మాణాలు వేగవంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. పల్లెపండగ పనులు, చెత్తశుద్ధి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా జరిపించాలని తెలిపారు. గ్రామాలలో పారిశుధ్యంపై ప్రజలకు తరచూ అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గృహనిర్మాణశాఖ ఏఈ సింహాచలం, ఆర్‌డబ్ల్యూస్ జేఈ జోగారావు తదితర అధికారులు పాల్గొన్నారు.

గోదాముల తనిఖీ

సీతానగరం: మండలంలోని సూరంపేటలో గల ఏఎస్ఆర్ గోదామును పార్వతీపురం ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఏపీస్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గల బఫర్ గోదామును సందర్శించి అక్కడి నిల్వలను, రికార్డులను పరిశీలించారు.

ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గోదాముల్లో ఉన్న నిల్వలకు తగిన సరుకు రికార్డుల్లో పక్కాగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో మండల అధికారులు, గోదాము నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆరోపణలు సరికాదు



కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న నాయకులు

పార్వతీపురం: అవినీతి, అక్రమాలకు పాల్పడిన చుక్క శ్రీదేవి తమ నాయకుడిపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని కొప్పులవెలమ సంఘం రాష్ట్ర డైరెక్టర్ గొట్టాపు వెంకటనాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌కు పెదబొండపల్లి, ఎమ్మార్‌నగరం గ్రామాల ప్రజలతో ఆయన విచ్చేసి మాట్లాడారు. పెదబొండపల్లి, ఎమ్మార్‌నగరం గ్రామాల్లోని దళితులు, రజకులకు సంబంధించిన భూములను చుక్క శ్రీదేవి గతంలో ఆక్రమించి పలు అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. తన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు తమ నాయకుడిపై ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలతో పాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



మద్యం షాపులను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ దాసు

సాలూరు: మద్యం విక్రయాల్లో నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ దాసు హెచ్చరించారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని బార్‌లు, మద్యం షాపులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ఉన్న స్టాకు రికార్డులను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని పునరుద్ఘాటించారు. మద్యం షాపుల్లో నిబంధనలు పాటించనట్లు గుర్తిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని లేదంటే 14405 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచనున్నట్లు చెప్పారు. సాలూరు మండలంలో కల్లు గీత కార్మికులకు రోస్టర్ ప్రకారం నూతనంగా మంజూరుచేసిన మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5గంటల వరకు పొడిగించినట్లు తెలిపారు. పదవ తేదీన ఉదయం 10 గంటలకు లాటరీ తీస్తారన్నారు.

కుళాయిలు రాక.. నీరు లేక..విలవిల



కుళాయిలు రాక నీరు లేక ఖాళీ బిందెలు

పార్వతీపురంటౌన్: తాగునీరు అందక పార్వతీపురం పట్టణ ప్రజలు విలవిలలాడుతున్నారు. పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలో చాకలి బెలగాంలో ఉన్న సిమెంట్ రోడ్డు, సాయి నగర్ కాలనీ, చాకలి బెలగాం ప్రాంతాలకు ఐదు రోజులుగా కుళాయిల నీరు రాకపోవడంతో తాగడానికి మంచినీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దయచేసి మున్సిపల్ అధికారులు కుళాయిల నీటిని సరఫరా చేయాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్సై సత్యనారాయణ

పార్వతీపురంటౌన్: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన పార్వతీపురం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సైబర్ నేరాల సంఖ్య పెరుగుతోందని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మొబైల్‌కు వచ్చిన అనవసర లింక్‌లు ఓపెన్ చేయవద్దని, ఓటీపీలు ఇతరులకు తెలియజేయరాదన్నారు. వాట్సాప్‌కు వచ్చిన వీడియో కాల్స్ ఎట్టి పరిస్థితుల్లో అటెండ్ కావద్దని చెప్పారు. బ్యాంకు నుంచి కాల్ చేస్తున్నాం, పోలీస్‌స్టేషన్ నుంచి కాల్స్ చెస్తున్నామంటూ కాల్స్ వస్తే వక్తిగత సమాచారాన్ని తెలియజేయరాదన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సంఘాలను బలోపేతం చేయాలి

సాలూరు: మహిళా సంఘాలను సక్రమంగా నడిపేలా చర్యలు తీసుకుని వాటిని మరింత బలోపేతం చేయాలని మెప్మా పథక సంచాలకుడు చిట్టిరాజు అన్నారు. ఈ మేరకు గురువారం సాలూరు పట్టణంలో మెప్మా ఆర్‌పీలతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బ్యాంకు లింకేజీ తీసుకున్న ప్రతి ఒక్కరూ వ్యాపారం పెట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా తగుచర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా సంఘాల ఉత్పత్తులు మై స్టోర్ యాప్‌లో ఆన్‌బోర్డ్ చేసి ఆన్‌లైన్‌లో అందరూ కొనుగోలు చేసేలా అందరికీ అవగాహన పెంపొందించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఎంఎం పుష్ప తదితరులు పాల్గొన్నారు.

పొగమంచుతో మాడుతున్న జీడిపూత



సాలూరు రూరల్: మండలంలోని ఏజెన్సీ ప్రాంతంలో గల పోడు భూముల్లో వేసిన గిరిజనుల జీడితోటల్లో పూత పొగమంచు కారణంగా మాడిపోతోంది. చెట్టు నిండుగా పూత బాగా వచ్చిందని ఆనంద పడుతున్న గిరిజన రైతులు పొగమంచు కారణంగా పంట నష్టం కలగనుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి వేతనదారుకు 100 పనిదినాలు కల్పించడమే లక్ష్యం



వేతనదారుల మస్తరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

సీతానగరం: మండలంలోని ఉపాధిహామీ పథకం వేతన దారులందరికీ వంద పనిదినాలు కల్పించడమే లక్ష్యంగా ఉపాధి పనుల్లో చేపట్టాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. ఉపాధి హామీ పథకంలో జానుమల్లువలస గొల్లవాని చెరువులో వేతన దారులు గురువారం చేస్తున్న పనులను, వేతన దారుల మస్తరును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయని డిమాండ్‌కు తగినట్లు వేతనదారులు పనుల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ప్రతి వేతన దారుకు ఉపాధి కల్పించనున్నట్లు తెలియజేశారు. ఈ నేపథ్యంలో జాను మల్లువలసలో ఉపాధి పనుల్లో డిమాండ్ ప్రకారం 275 మంది వేతన దారులు గురువారం పాల్గొనాల్సి ఉండగా 220 మంది పనుల్లో పాల్గొన్నట్లు మస్తరు వేయడంతో గుర్తించినట్లు చెప్పారు. వేతనదారులందరూ నిర్దేశించిన గడువులోగా మస్తరు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

11 చెరువుల్లో 1.47లక్షల చేప పిల్లల విడుదల



బర్లి గ్రామంలోని తామర చెరువులో చేప పిల్లలను విడుదల చేస్తున్న అధికారిణి శ్రీదేవి, సిబ్బంది

బలిజిపేట: మండలంలోని 11డిపార్ట్‌మెంట్ చెరువులలో 1.47లక్షల చేప పిల్లలను ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా సబ్సిడీపై విడుదల చేశామని ఎఫ్‌డీఓ శ్రీదేవి తెలిపారు. చేప పిల్లల పెంపకంపై మత్స్యకారులు దృష్టిసారించి మత్స్య సంపదను అభివృద్ధి చేయాలని కోరారు. ఎమ్మెల్సీ కోడ్ అమలులో ఉన్నందున అధికారులు, కమిటీ సమక్షంలో కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. మండలంలోని బర్లి తామర చెరువులో 20వేలు, గంగాడ గ్రామంలోని వల్లభనాయుడు, సిమ్మినాయుడు, హుస్సేన్‌ఖాన్ చెరువులలో 9,544, పెదపెంకి కృష్ణసాగరంలో 34వేలు, అసిరిపోలు చెరువులో 2,500, నూకలవాడ గుప్త చెరువులో 12వేలు, పలగర తామర చెరువులో 10వేలు, నారాయణపురం మల్లమ్మ చెరువులో 22,500, గొల్లంపి చెరువులో 22,500, పి.రావివలసలో దన్నాన చెరువులో 14వేల చేపలు విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మత్స్య సహాయకులు ఎ.కీర్తిప్రియ, కె.శంకరరావు, ఎన్.శ్రీకాంత్, వీఆర్వోలు, మత్స్యకార సహకార సంఘాల అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ నిధి రుణాల రికవరీ శతశాతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న స్త్రీనిధి ఏజీఎం హేమలత

బలిజిపేట: గత సంవత్సరం అందించిన స్త్రీ నిధి రుణాలు రూ.6కోట్ల మొత్తాన్ని శతశాతం రికవరీ చేయాలని స్త్రీ నిధి ఏజీఎం హేమలత స్పష్టం చేశారు. ఈ మేరకు వెలుగు శిక్షణ కార్యాలయంలో వీఓఏలతో గురువారం ఆమె రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో స్త్రీ నిధి రుణాలకు మంజూరు చేసిన రూ.6కోట్లలో ఇప్పటి వరకు 5శాతం మాత్రమే వసూలైందని, మిగిలిన 95శాతాన్ని మార్చి నెలాఖరులోగా రికవరీ చేయాలని ఆదేశించారు. అలాగే కొత్త రుణాల నిమిత్తం రూ.4.50కోట్లు లక్ష్యం కాగా ఇప్పటికి రూ.3.90కోట్లు ఇచ్చామని మిగిలిన మొత్తాలను లబ్ధిదారులకు అందించాలని సూచించారు. ప్రతి వీఓఏను రికవరీపై ప్రశ్నించి త్వరితగతిన వసూలు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో స్త్రీ నిధి మేనేజర్ సబీనా బేగం, ఏపీఎం ఉమామహేశ్వరరావు, సిబ్బంది, వీఓఏలు పాల్గొన్నారు.

ఈ మలుపులు ప్రమాదానికి పిలుపులు





వెంకంపేటలో ప్రమాదకరంగా ఉన్న మలుపులు

పార్వతీపురం రూరల్: పార్వతీపురం-ఒడిశా అంతర్ రాష్ట్ర పరిధిలో పార్వతీపురం పట్టణానికి కూతవేటు దూరంలో గల వెంకంపేట రహదారి పరిధిలో పలు మలుపులు ఉండడంతో వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామం మధ్యలో రహదారి ఏర్పాటు చేయడంతో నిత్యం వాహనాలతో రద్దీగా ఉండడంతో పాటు స్థానికులు రాకపోకలు చేస్తుండడంతో రహదారంతా రద్దీగా ఉంటోంది. దీనికి తోడు దగ్గర దగ్గరగా మలుపులు ఉండడంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ పోలీస్ యంత్రాంగం కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయడం లేదు. దీంతో ఈ రహదారి పరిధిలో కొత్తగా ప్రయాణం చేసేవారు రహదారి పరిస్థితి తెలియక ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనికి తోడు రహదారంతా గుంతలు ఉండడంతో వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడంతో పాటు రహదారి మరమ్మతులు నిర్వహించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల పార్టీ అధ్యక్షుల నియామకం

పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీ పార్వతీపురం పట్టణ, మండల పార్టీ అధ్యక్షులను నియమిస్తూ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయా ప్రతినిధుల వివరాలిలా ఉన్నాయి.

ప్రాంతం	అధ్యక్షుడి పేరు
పార్వతీపురం పట్టణం	కొండపల్లి బాలకృష్ణ
పార్వతీపురం మండలం	బొమ్మి రమేష్
సీతానగరం మండలం	బొంగు చిట్టిరాజు
బలిజిపేట మండలం	పాలవలస మురళీకృష్ణ

వర్తక కలాసీల సమస్య పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు

పార్వతీపురంటౌన్: వర్తక కలాసీల సమస్య పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం పట్టణంలోని నాలుగు రోడ్ల సెంటర్‌లో నిరసన తెలియజేస్తున్న వర్తక కళాశాలకు గురువారం ఆయన మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి యజమానులకు కలాసీలకు మధ్య వేతన ఒప్పందం జరుగుతుంది. పెరుగుతున్న ధరలతో విద్య వైద్యం ఖర్చులు విపరీతంగా పెరిగాయని, దానివల్ల కుటుంబ పోషణ కష్టమవుతోందన్నారు. కార్మికుల కష్టాన్ని యజమానులు అర్థం చేసుకుని వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేశారు. సిమెంట్, ఐరన్ వెజిటబుల్స్, కొబ్బరికాయల రేట్లకు యాజమాన్యం అంగీకరించింది. కిరాణా ట్రాన్స్‌పోర్ట్‌కు మాత్రం అంగీకరించకపోవడం చాలా దారుణమన్నారు. యాజమాన్యం కిరాణా ట్రాన్స్‌పోర్ట్ అగ్రిమెంట్ కూడా చేసుకోవాలని కోరారు. ప్రభుత్వాలు అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర భద్రత చట్టం పీఎఫ్ లాంటి సౌకర్యాలు కల్పించాలని, కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కార్మిక చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కోశాధికారి గొర్లె వెంకటరమణ, ఉపాధ్యక్షుడు రెడ్డి వేణు, పట్టణ నాయకులు బంకురు సూరిబాబు, సర్వేశ్వరరావు సింహాద్రి, సర్వేశ్వరరావు, లక్ష్మయ్య, తిరుపతిరావు, తదితర కార్మికులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పార్వతీపురం / సాలూరు
9010204441, 9951602891
Office mail : vzmadvt@gmail.com